క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా నేషనల్ పోలీస్ అకాడమీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కాటేదాన్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవీణ్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు శాస్త్రీపురం, రిజ్వాన్‌కాలనీ, ఓవైసీ హిల్స్, నూర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. శివరాంపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కోత ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ హరినాథ్‌చారి తెలిపారు.

బండి సంజయ్‌కు ఘన స్వాగతం



బండి సంజయ్‌ని సన్మానిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులై మొదటిసారి తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన ఎంపీ బండి సంజయ్‌ను మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బండి సంజయ్‌కుమార్‌తో కలిసి భారీ ర్యాలీగా నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బయలుదేరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి వెల్లడించారు. 3వ డివిజన్‌లో నివాసం ఉంటున్న ఎం.లలితకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ పత్రాన్ని శుక్రవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అనారోగ్యం కారణంగా ఎం.లలిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌వోసీని అందజేశామన్నారు. తద్వారా ఆమెకు డాక్టర్లు వైద్య సేవలు అందజేస్తారన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

సుల్తాన్‌బజార్: దివ్యాంగులు దేవుడితో సమానమని భావిస్తూ గత 25 సంవత్సరాలుగా శ్రీ గురుదేవా ఛారిటబుల్ ట్రస్ట్ లక్షలాది మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించడం అభినందనీయమని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ లో గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ పేద దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సంస్థ మాజీ డైరెక్టర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గవర్నర్ దత్తాత్రేయ, సెంట్రల్ విజిలెన్స్ కమీషనర్ కెవి.చౌదరి, వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడారు. ఈ సందర్భంగా జర్నలిస్టు శంకర్ నారాయణ రచించిన వాల్మీకి శతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఇప్పటివర కు సేవా సంస్థ సహకారంతో దాదాపు 142 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్, విశ్వేశ్వర్, ప్రతినిధి సుబ్బారావు, యుపిఎస్సీ ఫ్యాకల్టీ మెంబర్ మాధురి, ఇతర ట్రస్టు సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

పని చేసే వారికే గుర్తింపు

గోల్కొండ: పని చేసే వారికి గుర్తింపు లభిస్తుందని గొల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. గొల్కొండ పీస్, మైత్రి కమిటీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిల్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్‌కు ఆయన శుక్రవారం ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీస్ అండ్ మైత్రి కమిటి వారు గోల్కొండ కోట బోనాలు శాంతియుతంగా నిర్వహించడంలో ప్రశంసనీయమైన సేవలు అందించారని ఆయన అన్నారు. బోనాల పండుగలే కాకుండా గణేష్ ఉత్సవాలు, మొహర్రం, రంజాన్, బక్రీద్ పండుగల సందర్భంలో కూడా పీస్అండ్ మైత్రి సభ్యులు పోలీసులకు సహకరిస్తుంటారని ఆయన అన్నారు.



మహ్మద్ నజీబ్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాల్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

- అప్రమత్తంగా ఉండాలి
- సెల్‌ఫోన్‌ల వినియోగంతో ప్రమాదకర పరిస్థితులు
- లింక్స్, మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దు
- రాజేంద్రనగర్ జోన్ అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాల్

అత్తాపూర్: పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ భానోదయ హై స్కూల్‌లో శుక్రవారం చైల్డ్ సేఫ్టీ క్లబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ జోన్ అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాల్, ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సేఫ్టీ విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం రాజేంద్రనగర్ జోన్ అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాల్ మాట్లాడుతూ... ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఆన్‌లైన్ మోసాలు భారీగా పెరిగిపోయాయన్నారు. వాటిని అధిగమించేందుకు చిన్ననాటి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు జరుగుతున్న మోసాలపై అవగాహన పెంచుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లు ఎక్కువగా ఉపయోగించవద్దు అన్నారు. వాటిల్లో వచ్చే లింక్స్, మెసేజ్‌లను ఓపెన్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, పాఠశాల కరస్పాండెంట్ బి.భాస్కర్, ప్రిన్సిపాల్ బి.భవాని, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, డీన్

మణికొండ: జాతీయ స్థాయిలో 2022–23 సంవత్సరానికిగాను నాసా నిర్వహించిన ప్రాజెక్టు డిజైన్ పోటీలలో మణికొండ శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు రాణించారు. నాసా సంస్థ ఇచ్చిన ప్రాజెక్టును 9 మంది విద్యార్థుల బృందం డిజైన్ చేయగా దానికి తృతీయ బహుమతి సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పాఠశాలలో రాణించిన విద్యార్థులను ఆమె డీన్ జగన్‌తో కలిసి మెడల్స్, ధ్రువపత్రాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు చదువులతో పాటు ఇలాంటి రంగాల లోనూ రాణించేలా తర్ఫీదు ఇస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

నార్సింగి కౌన్సిలర్ అరుణజ్యోతి



నార్సింగిలో మొక్కలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అరుణజ్యోతి

మణికొండ: పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే పదికాలాలపాటు మానవాళి మనుగడ సాగించేందుకు అవకాశం ఉందని... ఇందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నార్సింగి మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ జి.అరుణజ్యోతి అన్నారు. శుక్రవారం ఆమె తన వార్డు పరిధిలో మున్సిపాలిటీ తరపున పూల మొక్కలు, ఔషధ మొక్కలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదన్నారు. అందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లు, వార్డుల పరిధిలోని రోడ్లు, ప్రభుత్వ స్థలాల్లో అధికారులు, కౌన్సిలర్‌లు మొక్కలను నాటి సంరక్షిస్తున్నారన్నారు. అదే పద్ధతిలో ప్రతి ఇంట్లో కనీసం ఐదు మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



మణికొండలో సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మణికొండ: పంచాయతీ రాజ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం గండిపేట మండల పరిధిలో ముమ్మరంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జి.చెన్నకేశవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోనే అతిపెద్ద టీచర్స్ యూనియన్ అయిన పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. కోర్టు ఉత్తర్వులు రాగానే బదిలీలతో కూడిన ప్రమోషన్‌లను ఇప్పిస్తామన్నారు. ఈ నెల 31వ తేదీలోపు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని తేవటంతో పాటు ఆరోగ్య కార్డులను ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.నారాయణగౌడ్, ప్రధాన కార్యదిర్శ ఎస్, మహేందర్‌రెడ్డి, గండిపేట మండల అధ్యక్షుడు మల్లేష్, గౌరవ అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి



కొత్త అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిని నగరంలోనే నెంబర్ వన్ ప్రభుత్వ ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గొల్కొండ ఏరియా ఆస్పత్రిలో కొత్తగా మంజూరైన రెండు అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత అసెంబ్లీ సమావేశాల్లో గోల్కొండ ఏరియా ఆస్పత్రి విషయం తాను లేవనెత్తానని దీనిపై రాష్ట్ర మంత్రి హరీష్‌రావు స్పందిస్తూ ఆస్పత్రి అభివృద్ధికి రూ. 8 కోట్లు కేటాయిస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ నిధులు ఇప్పటి వరకు మంజూరు కాలేదని ఈ అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి హరీష్ రావును కలిసి ఆ నిధులు మంజూరైయ్యేలా చూస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఆరూన్‌ఫర్హాన్, ఆస్పత్రి సూపరెంటెండ్ మజర్‌ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ -డీఆర్‌డీఓ ఎంఓయూ



పత్రాలను మార్చుకున్న ఇరు సంస్థల అధికారులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ), రక్షణశాఖలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) మధ్య ఒప్పందం కుదిరింది. న్యూఢిల్లీలోని డీఆర్‌డీఓ భవన్‌లో హెచ్‌సీయూ, డీఆర్‌డీఓ అధికారులు శుక్రవారం ఒప్పందంపై సంతకాలు చేశారు. హెచ్‌సీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్ ఎస్ సర్రాజు, డాక్టర్ మన్మోహన్ సమక్షంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, డీఆర్‌డీఓ డీఎఫ్‌టీఎం డైరెక్టర్ కై లాష్‌కుమార్ పాఠక్ సంతకాలు చేశారు. ఒప్పందం కాల పరిమితి 25 సంవత్సరాలు ఉంటుంది. ఈ ఒప్పందం ప్రకారం హెచ్‌సీయూలోని పరిశోధనలను సులభతరం చేయడానికి డీఆర్‌డీఓ తోడ్పాటు అందిస్తుంది. ఈ నూతన ఒప్పందంకు డీఆర్‌డీఓ- ఇండస్ట్రీ అకాడెమియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (డీఐఏ-సీఓఈ-హెచ్‌సీయూ)గా నామకరణం చేశారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

శంషాబాద్ రూరల్: పిల్లోనిగూడలో పంచాయతీ నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ కె.బుచ్చమ్మ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనుబంధ గ్రామం నుంచి పంచాయతీ ఏర్పాటు చేసిన తర్వాత సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని సర్పంచ్ తెలిపారు. ఇప్పుడు నిధులు రావడంతో భవన నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యుడు సుధాకర్, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జుర్కి రమేష్, నాయకులు కె.నర్సింహ, మహేష్, అంజయ్య, కిష్టయ్య, గోపాల్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓటర్ల అవగాహన



హసన్‌నగర్‌లో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అత్తాపూర్: ఓటు వేసే క్రమంలో ఎలాంటి తడబాటు.. తప్పులు దొర్లకుండా ఉండేందుకు 90 రోజుల పాటు జరిగే అవగాహన సదస్సులు ఎంతగానో ఓటర్లకు ఉపయోగపడతాయని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ అన్నారు. సంబంధిత అధికారులతో కలిసి హసన్‌నగర్ ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఓటర్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 90 రోజుల పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఓటర్ల అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు వీలు ఉందని ఓటర్లు కార్యక్రమంలో పాల్గొని తమ అనుమానాలను తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమణారెడ్డి, జనార్ధన్, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపుపై హర్షం

గచ్చిబౌలి: కాపు సంక్షేమ సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వం హైటెక్‌సిటీ వద్ద 6.35 ఎకరాల స్థలాన్ని కేటాయించిన నేపథ్యంలో ఎమ్మెల్యే గాంధీని ఆ సంఘం ప్రతినిధుల బృందం శుక్రవారం కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు మిర్యాల రాఘవరావు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎన్‌మూర్తి, నాయకులు దాసరి రంగారావు, భరత్‌కుమార్, భగవాన్, శ్రీనివాస్, ఆనందరావు, రాంబాబు, వాసునాయుడు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్, మసీదుబండ ప్రాంతాలలోని చిరు వ్యాపారులకు రఘునాథ్ ఫౌండేషన్ శుక్రవారం గొడుగులను పంపిణీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో వారికి చేయూత అందించేందుకు ప్రత్యేకంగా గొడుగులను తయారు చేయించామని నిర్వాహకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎం రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ రఘునాథ్ ఫౌండేషన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుందన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు ధర్మ జీవన్‌కుమార్, శ్రీకాంత్‌నాయక్, వినోద్‌రెడ్డి, ప్రసాద్, అఖిల్, గోపి ముదిరాజ్, శశి, అజమ్, రాజు, పవన్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన కబడ్డీ పోటీలలో కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గ, కలబురిగి, తుంకూరు క్లస్టర్లు, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ, కర్నూలు క్లస్టర్లు, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ క్లస్టర్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి క్లస్టరు నుంచి బాలురు, బాలికల విభాగం నుంచి అండర్-19, అండర్-17, అండర్-14 విభాగాలుగా విద్యార్థుల జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి.



‘డబుల్’ ఇళ్లపై ప్రజలను మోసగిస్తున్న సీఎం

బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమం: బీజేపీ



హైదర్‌గూడలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో ఆశ చూపి 8 ఏళ్లుగా దగా చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నిలదీసేందుకు భారతీయ జనతా పార్టీ ఉద్యమిస్తుందని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జీ మల్లారెడ్డి వెల్లడించారు. శుక్రవారం అత్తాపూర్ డివిజన్ హైదర్ గూడలో బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మోసపూరిత వాగ్దానాలను ఎండగట్టేందుకు బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ నెల 7వ తేదీన ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశామన్నారు. రాష్ట్రాభివృద్ధిలో బీఆర్‌ఎస్ పాత్ర ఏమీ లేదన్నారు. కేంద్రం నుంచి వస్తున్న నిధుల ద్వారానే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రజలకు తెలియజేసేందుకు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నామన్నారు. ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొమురయ్య, డివిజన్ అధ్యక్షులు విజయ్‌కుమార్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేష్, రాజశేఖర్, జయానంద్‌రెడ్డి, గౌరీశంకర్, సిద్ధేశ్వర్, ముఖేష్ బీరదార్, రాము, శ్రీకాంత్‌చారి, అనురాధ, బూత్ అధ్యక్షుడు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో ‘అబ్సల్యూట్ బార్బెక్యూస్’ ప్రారంభం





అబ్సల్యూట్ బార్బెక్యూస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ, టీఎస్ టెరిటరీ మేనేజర్ రామ్‌రంజన్

అత్తాపూర్: భారతదేశంలోని ప్రముఖ బార్బెక్యూ అండ్ గ్రిల్ బఫే రెస్టారెంట్‌ల గొలుసుకట్టు రెస్టారెంట్ల సంస్థ అబ్సల్యూట్ బార్బెక్యూస్ అత్తాపూర్‌లోని పి.వి.నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంఎబర్ 143 వద్ద తన 13వ అవుట్‌లెట్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ టీఎస్ టెరిటరీ మేనేజర్ రామ్‌రంజన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రాండ్‌కు ఇది 60వ అవుట్‌లెట్‌గా ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా అబ్సల్యూట్ బార్బెక్యూస్ అద్భుత వృద్ధికి, ప్రజాదరణకు ఇది నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కస్టమర్లు తాము అందించే సేవలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

వైరల్ జ్వరాలతో పరేషాన్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

మణికొండ: వర్షాకాలంలో వచ్చే వైరల్ జ్వరాలతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సెంచురీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని యాంబియెన్స్ యార్డ్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన జ్వర బాధితులకు ఆరోగ్య జాగ్రత్తలు తెలిపి, బీపీ, షుగర్, బీఎంఐ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించటం, కాచి చల్లార్చిన నీటిని తాగటం, కూరగాయలను రెండు సార్లు పరిశుభ్రంగా కడగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌లు యూన్సీ, కీర్తిలతోపాటు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో...

మద్యం దుకాణాల కేటాయింపు ఇలా..

- ఐదు దుకాణాలు ఎస్సీలకు, మూడు షాపులు గౌడ కులస్తులకు రిజర్వేషన్
- ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



రాజేంద్రనగర్: శంషాబాద్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ పరిధిలో 35 వైన్ షాపులకు ఐదు ఎస్సీ, మూడు గౌడ కులస్తులకు రిజర్వేషన్ అయ్యాయని ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ వెల్లడించారు. ఉప్పర్‌పల్లిలోని స్టేషన్ ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో మొత్తం 35 వైన్‌షాపులకు శుక్రవారం నుంచి దరఖాస్తులను అందించడం ప్రారంభించామన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా లేదా స్టేషన్ నుంచి తీసుకోవచ్చునన్నారు. రెండు లక్షల రూపాయల డీడీతో పాటు దరఖాస్తు ఫారాన్ని శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దరఖాస్తుదారులు బండ్లగూడ ఎక్సైజ్ పోలీస్ అకాడమీ ఆవరణలో అందించాలన్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని వైన్స్ దుకాణాలన్నింటికీ ఎక్సైజ్ అకాడమీలోనే దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్‌లో 21వ తేదీన లక్కీ డ్రా ద్వారా జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు లాటరీ ద్వారా డ్రా తీస్తారన్నారు. గత సంవత్సరం అత్యధికంగా 1700 పైచిలుకు దరఖాస్తులు శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 35 దుకాణాలకు దరఖాస్తులు అందాయి. ప్రస్తుతం రెండు వేలకు పైగా దరఖాస్తులు అందుతాయని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని లేదా పోలీస్ స్టేషన్ ఆవరణలో దరఖాస్తులను అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్టేషన్ ఆవరణలో దరఖాస్తులు అందిస్తామన్నారు. రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ పరిధిలో 12 దుకాణాలలో రెండు ఎస్సీలు, రెండు గౌడ్‌లకు కేటాయించినట్లు తెలిపారు. బండ్లగూడ జాగీరు పరిధిలో ఐదు దుకాణాల్లో ఒకటి ఎస్సీ, నార్సింగి మున్సిపల్‌లో ఐదు దుకాణాలకు ఒక ఎస్సీ, మణికొండ మున్సిపల్‌లో నాలుగు దుకాణాలకు ఒక ఎస్సీ, శంషాబాద్ మున్సిపల్‌లోని ఏడు దుకాణాలలో ఒక దుకాణం గౌడ కులస్తులకు రిజర్వేషన్ కేటాయించినట్లు తెలిపారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి



జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న షేక్ ఖాసీం, ప్రతినిధులు

శేరిలింగంపల్లి: గుల్‌మొహర్‌పార్కు కాలనీ సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో కలిసి కాలనీలో సీసీ రోడ్లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ నిర్మాణం, దెబ్బతిన్న బీటీ రోడ్లకు మరమ్మతులు, పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని, త్వరలో కాలనీలో పర్యటిస్తానని చెప్పారని కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం తెలిపారు. అనంతరం జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు విల్సన్, సైమన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరిగింది

గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: తెలంగాణ పోలీసులు అవలంభిస్తున్న విధానాల వల్ల ప్రజలకు పోలీసులపై నమ్మకం బాగా పెరిగిందని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం ఆయన గొల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటి సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోల్కొండ జోన్ ఏసీపీగా రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. గతం గోల్కొండ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పని చేసిన అనుభవం తనకు ఉందన్నారు. ఆ సమయంలో తనకు అందరితో పరిచయాలు ఉన్నాయని గత అనుభవంతోనే తాను గోల్కొండ జోన్‌లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు కాపాడదానికి కృషి చేస్తానని అన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, పీస్ కమిటీ సభ్యులు రాజు వస్తాద్, ఇలియాస్ అక్బర్ పాల్గొన్నారు.